అదృశ్యమైనవాడు

-నందిగం కృష్ణారావు



సాయంత్రం ఆరైంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు.

తూర్పు వాకిలి ముందు నిల్చున్న తల్లి శాంతమ్మ అప్పటికి రెండు గంటల ముందు నించి కొడుకు మధుసూదనం గురించి ఎదురుచూస్తోంది.

ప్రతిరోజూ మధ్యాహ్నం మూడైనప్పటి నించీ ఆమె ధ్యాసంతా కొడుకు మీదే ఉంటుంది. సరిగ్గా అదే టైంకి మధు కాలేజి నించి వస్తాడు. వచ్చేసరికి బిడ్డ ఆకలితో ఉంటాడని, ఏదో ఒకటి చేసి ఉంచడం శాంతమ్మకి అలవాటు. తీరా సమయానికి బిడ్డ రాపోతే ఆమె హృదయాన్ని ఎవరో పిండినట్లుగా బాధపడిపోతుంది. ఆ రోజు మధుకి ఇష్టమని మైసూర్‌పాక్ చేసింది. అది తయారైనాక ఒక పళ్ళెంలో పోర్లించింది. అది పళ్ళెం నిండా విస్తరించుకొంది. ముక్కలు కోసి అది చల్లారినాక డబ్బాలో పెడదామనుకొంది.

చల్లారక ముందే మధూ వస్తే అప్పటికప్పుడే పెట్టమని పేచీ పెడతాడు. అలా చేస్తే మైసూర్‌పాక్ పొడిపొడి అయిపోతుంది. 'వీడెప్పుడూ ఇంతే! తొందరెక్కువ పిచ్చి తండ్రికి' అనుకొని మైసూర్‌పాక్ పళ్ళాన్ని బయటికి కనిపించకుండా దాచింది.

సాయంత్రం నాలుగ్గంటలకల్లా రావల్సిన కొడుకు అయిదైనా రాకపోయేసరికి ఆందోళన పడసాగింది. రావడంతోటే 'అమ్మా ఆకలేస్తోందే తినడానికేమైనా పెట్టు' అని హడావుడి చేసే కొడుకు, ఇవాళ ఇంకా ఎందుకు రాలేదు? వాడసలే ఆకలికి తట్టుకోలేడు. ఏ స్నేహితుడింటికైనా వెళ్ళాల్సొచ్చినా ముందు ఇంటికి వచ్చి ఏదో ఒకటి తిన్నాకే వెళ్తాడు. వాడికసలు హోటలికి వెళ్ళే అలవాటు కూడా లేదు. మరలాంటి వాడు ఈ వేళ టైంకి ఇంటికెందుకు రాలేదు? అన్న ప్రశ్న ఆమెని కుమ్మరి పురుగులా తొలుస్తోంది.

ఆ వేళ పొద్దున్నే మధూ కాలేజీకి వెడుతుంటే అతన్ని సాగనంపడానికి వీధి గుమ్మం వరకూ వచ్చిన శాంతమ్మకి కుడికన్ను అదిరింది. కుడికన్ను అదరడం మంచి శకునం కాదు. ఇవాళ ఏమౌతుందో ఏమిటో అని అప్పుడే అనుకొంది. తరువాత లోపలికి వచ్చి వెంకటేశ్వర స్వామికి దండం పెట్టుకొని తన ఇంటిని చల్లగా చూడమని వేడుకొంది.

మధు రాక ఆలస్యమయ్యేసరికి, పొద్దున్న కుడికన్ను అదిరిన సంగతి జ్ఞాపకం వచ్చింది శాంతమ్మకి. ఆమెలో ఒక్కసారిగా తన శక్తంతా హరించుకు పోయినట్లయింది. ఒంటినిండా చెమట పట్టింది. నిల్చోలేక పోయింది. వీధి గడప మీద కూలబడిపోయింది. కొద్దిసేపటి వరకూ స్తబ్దంగా ఉండిపోయింది.

'ఏం శాంతమ్మా! ఇక్కడ కూర్చున్నావ్?' అని పలకరించింది పక్కింటి కమలమ్మ. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి పడిన శాంతమ్మ, 'ఏం లేదు... ఏం లేదు. బాబు ఇంకా రాలేదని చూస్తున్నాను' అని చెప్పింది.

అప్పటికి బాగా చీకటి పడింది. వీధిలో విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. చుట్టుపక్కల అందరిళ్ళల్లోనూ లైట్లు వేసి ఉన్నాయి. ఒక్క శాంతమ్మ ఇంట్లోనే దీపాలు వెలగడం లేదు.

దీనికే ఇంత ఇదై పోవాలా? ఎక్కడికి వెళతాడు? ఎక్కడికీ వెళ్ళడు. దార్లో ఏదైనా పని ఉండి ఆగిపోయాడేమో? వచ్చేస్తాడ్లే ముందు లేచి వెళ్ళి ఇంట్లో దీపం పెట్టుకోమ'ని చెప్పి వెళ్ళింది కమలమ్మ.

అప్పుడు లేచి వెనక్కి తిరిగిన శాంతమ్మకి తన కంటిపాపడు కనిపించకపోయేసరికి తన కళ్ళల్లో పేర్కొన్న కఠినమైన చీకటి తన ఇంట్లోకి పాకినట్లనిపించింది.

నెమ్మదిగా ఇంట్లోకి అడుగుపెట్టి హాల్లో లైట్ వేసింది. ఆ వెలుగులో గోడ మీద వేలాడుతున్న వెంకటేశ్వరస్వామి పటానికి, అలివేలు మంగమ్మ పటానికి దండం పెట్టి, గోడ మీద నించీ వాళ్ళిద్దర్నీ తన హృదయంలో బంధించి, తన ఎదర నిలుపుకొని, 'నా కొడుకును కాపాడు స్వామీ. వాడికే ఆపదా లేకుండా చూడు తండ్రీ. నాకు కడుపుకోత లేకుండా చూడమ్మా! ఏ జన్మలో చేసుకొన్న పాప ఫలితమో, ఈ జన్మలో పసుపు కుంకాలకి దూరం చేసింది' అంటూ వేలవేల దండాలు పెట్టుకొంది. ఆ తరువాత చెంపలు వేసుకొని, తెలిసీ తెలవక ఏమైనా తప్పుచేసి ఉంటే క్షమించమని వేడుకొంది. ఆ తరువాత ఆ ప్రక్కనే ఉన్న భర్త ఫొటోకి దండం పెట్టుకొని 'నీ కొడుకుని, మన బంగారు తండ్రిని నూరేళ్ళు బ్రతకమని ఆశీర్వదించు' అని కోరుకుంది.

పెళ్ళైన యాడాదికే కొడుకు పుట్టాడు. ఆ తరువాత సంవత్సరానికి, ఎవరికీ అంతుపట్టని జబ్బుతో అకస్మాత్తుగా భర్త పోయాడు. అతను చనిపోయే ముందు భార్యనీ, కొడుకునీ దగ్గరకు తీసుకొని 'నేను లేనని బాధపడకు శాంతా! వీళ్ళో నన్ను చూసుకో. వీడి కోసం గుండె దిటవు చేసుకొని బ్రతుకు' అని శాసించినట్లుగా చెప్పాడు.

అతను మిగిల్చిపోయిన ఆస్తినించి వస్తున్న కాస్తంత ఆదాయంతో, లోకాన్నంతా మధుసూదనంలోనే చూసుకొంటూ బ్రతుకుతోంది శాంతమ్మ.

మధు అల్లరి చిల్లర వాడేమీ కాదు. ఈ రోజుల్లో కుర్రాళ్ళల్లా అతనికే దురలవాట్లూ లేవు. కాకపోతే గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఇయర్‌లో ఉన్నా చిన్న పిల్లాడిలా అల్లరి చేస్తాడు. తన దగ్గర మారాం చేస్తాడు. వాడికి మాత్రం ఎవరున్నారు. ఒక్క తను తప్ప అనుకొంది శాంతమ్మ. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'వచ్చేస్తాడు... వచ్చేస్తాడు. పిచ్చితండ్రి. వాడికి మాత్రం పరిగెట్టుకొచ్చి తనని చూడాలని ఉండదా'నుకొని మురిసిపోయింది.

గతాన్నించి, వర్తమానాన్నించి, భవిష్యత్తులోకి వెడుతున్న కాలం శాంతమ్మకి ఎదురునిల్చి రాత్రి తొమ్మిదైందని చెప్పింది. అప్పుడే తొమ్మిదైందానని ఆశ్చర్యపోయింది శాంతమ్మ టేబుల్ వాచ్ చూసి.

మధుసూదనం భోజనం చేసే టైం ఇది. వాడసలే ఆకలికి ఆగలేడు. బయట ఏమైనా తిన్నాడో లేదో? ఫస్ట్ షో వదిలే టైం. స్నేహితుల బలవంతం మీద సినిమాకి వెళ్ళినా ఈపాటికి వస్తూ ఉంటాడు. ఇంకో సారి ఇలా చేయొద్దని గట్టిగా మందలించాలి. అయ్యో, నా మతి మండ పిల్లాడికి ఇంకా అన్నం

వండలేదు. నా మటుకు పొద్దున్న మిగిల్న అన్నం సరిపోతుంది. వాడు అన్నం వేడిగా లేకపోతే తినడు' అనుకొని వెళ్ళి, అన్నం వండింది. పొద్దుటి కూరలు వేడి చేసింది.

తొమ్మిదిన్నర దాటింది. ఊళ్లో ఏ మూల ఉన్న సినిమా హాలు నించి నడిచొచ్చినా ఈ పాటికి ఇల్లు చేరాలి కదా? ఇంకా ఎందుకు రాలేదు? దార్లో ఏమైనా అయి ఉంటుందా? అసలే రోజులు బాగోలేవు, అనుకొంటూ శాంతమ్మ తిరిగి వీధి గుమ్మంలోకి వచ్చి నిల్చొంది.

చలికాలం కావడంతో వీధిలో పెద్దగా జనసంచారం లేదు. అందరూ తలుపులు, కిటికీలు వేసుకున్నారు. ఆ వీధిలోకి వచ్చి పోయే వాళ్ళ అడుగుల శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. అడుగుల చప్పుడు విన్నప్పుడల్లా చలికి ముడుచుకు బద్ధకంగా పడుకున్న కుక్కలు లేచి మొరుగుతున్నాయి.

అడుగుల చప్పుడికి కుక్కలు మొరిగినప్పుడల్లా శాంతమ్మ ఆశగా చూసింది. మొరిగే కుక్కలు కొడుకునేమైనా చేస్తాయేమోనని భయపడింది.

చూస్తుండగానే రాత్రి పదకొండైంది. మధు జాడ లేదు. తమ ఇంట్లోనే వెనక గదిలో అద్దెకుంటున్న విశ్వనాథాన్ని లేపింది శాంతమ్మ.

విశ్వనాథం ఒంటరి బ్రాహ్మడు. అతను వైదికుడో, నియోగో ఎవరికీ తెలవదు. అవసరాన్ని బట్టి నడుచుకొంటాడు. అందుచేత ఉన్నవాళ్ళు అతన్ని కర్మకాండలు జరిపించడానికీ, లేనివాళ్ళు శుభకార్యాలు జరిపించడానికీ పిలిపిస్తారు. ఈ పనులేవీ లేనప్పుడు అతను నలుగురికీ మంచి మాటలు చెప్పి, శుభం పలికి వాళ్ళిచ్చిన తృణమో, ఫణమో తీసుకొంటాడు.

విశ్వనాథం అప్పటికి నిద్రపోలేదు. కాని అప్పుడే నిద్రనించి లేచినట్టు నటించాడు. అతను అంతకు ముందే మధుసూదనం రాని సంగతీ, శాంతమ్మ కంగారు పడుతున్న విషయమూ గ్రహించాడు. అయినా, ఆ విషయం ఎరగనట్లు ఊరుకొన్నాడు.

మొహం మీద ప్రశాంతత పులుముకొని, చిరునవ్వుతో ఏం కావాలని ప్రశ్నించాడు.

'బాబూ! ఇప్పటివరకూ మా మధుసూదనం రాలేదు. ఎప్పుడూ ఇంత పొద్దుపోయేవరకూ రాకుండా ఉండలేదు. కాస్త వాడి స్నేహితుల ఇళ్ళకి వెళ్ళి కనుక్కొని రా నాయనా' అని అడిగింది.

'ఏ సెకండ్ షోకైనా వెళ్ళి ఉంటాడేమో...'

సెకండ్ షో అయిపోయేవరకూ చూద్దామని చెబుదామనుకున్నాడు, విశ్వనాథం. అలా చెప్పేట్లయితే ముసల్ది అర్ధరాత్రి వరకూ మేల్కొని ఉండి తిరిగొచ్చి తనని లేపుతుందనుకొన్నాడు. అందుచేత ఈ గొడవేదో ఇప్పుడే తేలిస్తే మంచిదనుకొని, లోపలికెళ్ళి ఒంటిమీద చొక్కా వేసుకొని వచ్చాడు.

మధుసూదనం స్నేహితు లెవరో వాళ్ళు ఎక్కడెక్కడ ఉంటారో వివరంగా చెప్పింది శాంతమ్మ.

'అలాగేనండీ మీరేమీ కంగారు పడొద్దు' అని ధైర్యం చెప్పి బయలుదేరాడు విశ్వనాథం.

విశ్వనాథం అన్ని చోట్లా వెదికాడు. ఎక్కడా మధు జాడ తెలవలేదు. ఆ రోజు అతను మామూలుగానే కాలేజీ నించి ఇంటికి బయలుదేరినట్లు చెప్పారతని స్నేహితులు.

రోజూ మధుతోపాటూ వాళ్ళింటి దగ్గరలో ఉన్న దీపక్ మహల్ వరకూ కలసివచ్చే అతని స్నేహితుడు కుమార్ మాత్రం మధుని నలుగురు వ్యక్తులు దీపక్‌మహల్ ప్రక్క సందులోకి తీసుకువెళ్ళి జిప్సీ జీపులోకి కూర్చోపెట్టుకోవడం చూశానని చెప్పాడు.

ఈ రోజుల్లో జిప్సీ జీప్ పోలీసులు మాత్రమే వాడుతున్నారు. అంటే మధుని పోలీసులు తీసుకువెళ్ళలేదు కదా?నని అనుమానించేడు విశ్వనాథం. ఈ రోజుల్లో కుర్రాళ్ళని నమ్మడానికి వీల్లేదు. పాతికేళ్ళు నిండని కుర్రాళ్ళు చాలా మందికి నక్సలైట్లతో సంబంధాలు ఉంటున్నాయి. మధు ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ సీరియస్‌గా ఉంటాడు. అతను చదివే పుస్తకాలు రామాయణ మహాభారతాలలో, వేదోపనిషత్తులలో కాదు... ఎందుకైనా మంచిదని 'మధుని తీసుకువెళ్ళిన వాళ్ళు పోలీసులు కాదు కదా'నని అడిగాడు.

'అలా లేరంకుల్! వాళ్ళు పోలీసులనుకొంటే నేను ఊరుకొనే వాణ్నా' అన్నాడు కుమార్.

గుండెలు మీద భారం దిగి పోయినట్లయింది విశ్వనాథానికి. 'హమ్మయ్యా' అని నిట్టూర్చేడు.

విశ్వనాథం వెనక్కి తిరిగాడు. కుమార్ కూడా అతన్ని అనుసరించాడు.

వాళ్ళు మధుసూదనం ఇంటికి వెళ్ళేసరికి అర్ధరాత్రి దాటిపోయింది. విశ్వనాథం ఏమైనా కబురు తెస్తాడేమోనని శాంతమ్మ ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

అతని ప్రక్కన కుమార్‌ని చూసి, ముందు మధుసూదనమే ననుకొంది. ఎంతో సంతోషంతో కొడుక్కు ఎదురెళ్ళడానికి రెండు మెట్లు దిగింది. అప్పుడు పోల్చుకొంది, వస్తోంది తన కొడుకు కాదని.

విశ్వనాథం ఏం దుర్వార్త తీసుకు వస్తున్నాడోనని శంకించిందామె. భయంతో ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

విశ్వనాథం ఆమె మొహం చూసి మధు రాలేదన్న విషయం కనిపెట్టాడు. అయినా 'వచ్చాడా అండీ' అని అడిగాడు.

విశ్వనాథానికామె సమాధానం చెప్పలేదు. 'బాబూ మా మధుని చూశావా?' అని కుమార్ని అడిగింది.

'సాయంత్రం మేం ఇద్దరం కల్సే వచ్చాం ఆంటీ'

కుమార్‌తోపాటూ వచ్చిన మధు ఏమయ్యాడు? గాలిలో కల్సిపోయాడా? ధూళితో కొట్టుకుపోయాడా? నేల చీలితే ఆ నేలలో కూరుకుపోయాడా? నింగి కెగిరిపోయాడా? ఏమయ్యాడు? ఏమయ్యాడు? తన మధు ఏమయ్యాడు? అని ఆమె బయట కనిపించని మధుసూదనాన్ని తన హృదయంలో చూసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

అప్పుడా ఇంటి ముందర ఒక జిప్సీ జీప్ వచ్చి ఆగింది.

ఆ జీపులోంచి బిలబిల్లాడుతూ పోలీసులు దిగారు.

మధు కూడా ఆ జీపులోంచి దిగుతాడేమోనని ఆశపడ్డాడు కుమార్.

అందులో మధు లేడు.

మరైతే మధు ఏమయ్యాడు?

'మధుసూదనరావు ఇల్లు ఇదేనా?' అని అడిగేడు. తలుపు చెక్కలా అడ్డంగా బలిసున్న ఇన్‌స్పెక్టర్.

'మా మధు' అని శాంతమ్మ ఏదో అడిగేలోగానే, ఇన్‌స్పెక్టర్ ఆమెని ఒక ప్రక్కకి నెట్టి జబర్దస్తీగా ఇంట్లోకి వెళ్ళాడు.

అతన్ననుసరించారు మిగతా పోలీసులు.

పుస్తకాల షెల్ఫ్‌లూ, పరుపుల క్రిందా, దిళ్ళనీ చించీ వెదికారు. ఎక్కడా మధు కనిపించలేదు వాళ్ళకి. ఇంట్లో వున్న సామాన్లన్నీ చిందరవందర చేశారు.

మధు రాసుకొన్న నోట్స్ తీసుకు చూసి ఎలకల కంతలో కొండను కనుగొన్న వాళ్ళా మొహం పెట్టాడు ఇన్‌స్పెక్టర్.

'బాబూ అవి మధు రాసుకున్న నోట్స్ నన్నే ముట్టుకోనివ్వడు. ఇటు ఇవ్వండి' అడిగింది శాంతమ్మ

శాంతమ్మని ఛీత్కారంగా చూశాడు ఇన్‌స్పెక్టర్. 'జరుగు' అంటూ ఆమెని ప్రక్కకి తోశాడు. ఆ ధాటికి శాంతమ్మ క్రింద పడింది. ఆమె తల గడపకి తగిలి, తల చిట్లింది. బాధతో 'అమ్మా!' అంటూ స్పృహ కోల్పోయింది.

(మిగతా 14వ పేజిలో...)

కవర్‌స్టోరీ సూపర్బ్!

జనవరి 4, ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలోని 'జండాలెన్ని ఉన్నా ఎజెండా సున్నా' కవర్‌స్టోరీ రియల్లీ సూపర్బ్. భానుమతిగారి ఇంటర్వ్యూ ఈ వారం అనుబంధానికి మరింత వన్నె తెచ్చింది. భావనలోని కవితలన్నీ మా మనసును దోచాయి. వారంవారం ఇలా కొత్తకొత్త సొగసులతో, మనసును దోచే ముస్తాబుతో మా అందరి మన్ననలను పొందుతున్న ఆంధ్రభూమి ఆదివారం అనుబంధానికి కృతజ్ఞతలు.

-మరువల్లి యజ్ఞేశ్వరరావు, శ్యామలారాణి (శ్రీకాకుళం)

చిత్ర సీమకే ఆణిముత్యం!

జనవరి 4, ఆదివారం అనుబంధంలో పి.భానుమతితో ఇంటర్వ్యూ చదివాను. ఇంటర్వ్యూ కాబట్టే ఆమె కొన్ని విషయాల్ని మాత్రమే చెప్పారు. ఎవర్నైనా పొగిడేటప్పుడు బహుముఖ ప్రజ్ఞా(శా)శీలి అని అనడం రివాజు. కానీ ఆ పదం అందరికీ వర్తించదు. భానుమతి వంటి వారికి వర్తిస్తుంది. తెలుగు చలనచిత్ర సీమలో ఆమె ఒక అధ్యాయాన్ని సృష్టించారు. తెలుగు చలనచిత్ర చరిత్ర రాస్తే ప్రథమాధ్యాయాల్లో భానుమతి పేరు ఉండి తీరుతుంది. ఆమె నటి, నర్తకి, రచయిత్రి, గాయకురాలు, దర్శకురాలు, నిర్మాత, స్టూడియో అధినేత. తెలుగులో ప్రప్రథమ మహిళా దర్శకురాలిగా ఆమె పేరు పొందింది. ఆమెకి సంగీతం అంటే ఎంత ప్రేమంటే, తను నిర్మించిన ప్రతీ చిత్రంలోనూ త్యాగరాజ కీర్తనో, అష్టపదో, జావళీయో, తరంగమో, అన్నమయ్య పదమో ఉండేది. మరో విశేషమేమంటే ఆమె తన పాటల్ని తానే పాడుకునేది, మరొకరికి ఆమె పాడలేదు!

'వరవిక్రయం'లో నటిస్తున్నప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారితో ఆమెకి పరిచయం కలగడం యాదృచ్ఛికం కావచ్చు. నిజానికి 'వరవిక్రయం' రాసింది కాళ్ళకూరి నారాయణరావుగారు. ఇక ఆమె రచనల్లో సునిశితమైన హాస్యం తొంగి చూసేది - 'మరచెంబు' కథ తరువాత 'అత్తగారు - ఆవకాయ' 'అత్తగారూ - అమెరికా యాత్ర' వంటి ఎన్నో హాస్యకథలు రాశారు. ఏది ఏమైనా భానుమతి తెలుగు చలనచిత్ర సీమకి ఒక ఆణిముత్యం వంటిది. సందేహం లేదు.

'భావన'లో 'కుంతలాల కుంచెలు' కవితా సంపుటిపై అద్దేపల్లి రామమోహన్‌రావుగారి సమీక్ష ఎంతో బాగుంది. గ్రంథ సమీక్ష చేయడంలో అద్దేపల్లి వారి శైలి మనోహరంగా ఉంటుంది. సమీక్ష చేసిన గ్రంథాన్ని కొని చదవాలనిపిస్తుంది. చార్లీచాప్లిన్‌పై యజ్ఞమూర్తి లఘు వ్యాసం బాగుంది. చాప్లిన్‌పై ఒక బ్రిటీష్ రచయిత 7 సంపుటాలు రాశారు. ఒక్కో పుస్తకంలో 600 పేజీల చొప్పున ఉన్న ఈ గ్రంథాన్ని చదివితే చాప్లిన్ విశ్వరూపం కనిపిస్తుంది. ప్రపంచంలో మరే నటుడు, నటిపై ఇంత విస్తృతంగా గ్రంథాలు వెలువడలేదు. చాప్లిన్ తను నవ్వుతూ మనకి కళ్ళు తడి పెట్టించి, అవి తుడుచుకునేలోగానే ఫక్కున నవ్విస్తాడు. సునిశితమైన హాస్యానికి చిరునామా - చార్లీచాప్లిన్.

-మునుమూరి రామచంద్రమూర్తి (విజయవాడ)

అదృశ్యమైనవాడు (కథ)

(11వ పేజీ తరువాయి...)

'ఆవిడ ఏమందని మీరు అలాగ ప్రవర్తించారు' అంటూ ఆవేశంగా ముందుకొచ్చాడు కుమార్. అతను ఇన్‌స్పెక్టర్ని చూడగానే, ఆశ్చర్యపోయాడు! 'మీరు... మీరు... మీరే కదా మధూని తీసుకెళ్ళింది' అని అడిగాడు.

దానికి సమాధానం చెప్పలేదు ఇన్‌స్పెక్టర్.

'నువ్వు కూడా టెర్రరిస్టులా ఉన్నావు. మీ నాయకుడు మధు ఎక్కడున్నాడో చెప్పు' అని నిలేశాడు.

కుమార్ ఆశ్చర్యపోయాడు. నోట్లోంచి మాట రాలేదు. 'వీణ్ణి తీసుకువెళ్ళి నాలుగు తగిలిస్తే కానీ నిజం చెప్పడు' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కానిస్టేబుల్స్ వచ్చి కుమార్ని రెక్కలు పట్టుకొని బలవంతంగా జీపు ఎక్కించారు.

ఇది చూసిన విశ్వనాథానికి గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. ఇన్‌స్పెక్టర్ జీపు ఎక్కుతూ ఒక్కసారి విశ్వనాథం కేసి అనుమానంగా చూశాడు.

విశ్వనాథం తన మెళ్ళో ఉన్న రుద్రాక్షమాల తీసి కళ్ళకద్దుకున్నాడు. వీడితో తనకి ప్రమాదం లేదనుకొని ఇన్‌స్పెక్టర్ అతన్ని వదిలేశాడు.

ఇన్‌స్పెక్టర్ జీపు ఎక్కాడు. జీపు పోలీసుస్టేషన్ కేసి కదిలింది.

ఒక గంట తరువాత కానీ శాంతమ్మ స్పృహలోకి రాలేదు. అప్పుడామెకి ఆ రోజంతా ఏం జరిగిందో గుర్తుకు రాలేదు. తానెందుకు గడప మీద పడుకున్నానా ననుకొంది.

వంటింట్లో నేల మీద చిందర వందరగా పడిపోయిన మైసూర్‌పాక్ ముక్కలు తమ గుభాలింపుతో ఆమెని పలకరించాయి.

'ఇంకా రాలేదు కదా?... నా పిచ్చికన్న ఇంకా రాలేదు కదా?' అనుకొంటూ లేచింది. వెయ్యి టన్నుల బరువును మోస్తున్నట్లుగా తలంతా భారంగా ఉంది. ఉన్నపళంగా నేలలోకి కూరుకు పోతానేమోననుకొని గోడని ఆసరా చేసుకొంది. అప్పుడామెకి ఆ రోజు జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటిగా గుర్తొచ్చాయి.

తను గాయపడ్డ దానికంటే తనని పోలీసు లవమానించినందుకు ఆమె ఎక్కువ బాధపడింది. తన కొడుకు ఎవర్ని ఖూనీ చేశాడని, ఎవరి కొంపలు కూల్చాడని పోలీసులు ఈ దురాగతానికి దిగారు? వాడు లేనప్పుడే ఇంత యాగీ చేశారే, వాడు కనిపించి ఉంటే వాడ్ని ఏం చేసేవారో?.... ఏ లాకప్‌లోనో పడేసి చితక్కొట్టే వారేమో... ఏ ఎన్‌కౌంటర్ పేరు మీదో వాణ్ణి చంపేసే వారేమో... ఇప్పుడైనా వాళ్ళాపని చెయ్యరని నమ్మకమేమిటి, ఇప్పుడు దొరకలేదు కదానని రేపు మళ్ళీ వస్తారేమో? ఏ సందు మొదట్లోనే మాటువేసి కాటేస్తారేమో? నన్ను రకరకాల అనుమానాల్తోటీ, భయాల్తోటీ ఆమె నిలువునా వొణికి పోయింది. అప్పటివరకూ మధు రాలేదని దిగులు పడిన ఆమె, ఇంక మధు రాకుండా ఎక్కడికైనా వెళ్ళిపోయి బ్రతికిపోతాడనుకొంది.

పోలీసుల క్కనిపించకుండా, తనక్కనిపిస్తే ఎక్కడికైనా వెళ్ళిపొమ్మని చెబుదామనుకొని మధు కోసం రాత్రింబగళ్ళు ఎదురుచూస్తోంది శాంతమ్మ.

కుమార్ని నానా హింసలు పెట్టారు. అతను మధూని మర్చిపోయాడని నిర్ధారించుకొన్నాక, అతని దగ్గర బాంబులు దొరికాయని కేసుపెట్టారు. ఆ తరువాత అతను తను ఏ పాపం ఎరగనని చెప్పుకుంటూ తిరుగుతున్నాడు.

మధు ఒక కల్పన. అతను చెయ్యని నేరం లేదు. ఎన్‌కౌంటర్‌లో చచ్చిపోయిన వాళ్ళు అతని వారసులు. పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. రెండురోజుల కొకసారి శాంతమ్మ ఇల్లంతా గాలిస్తున్నారు.

అతన్ని పట్టిస్తే లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మధూ రాకూడదు. రాకూడదు. పోలీసులకి చిక్కకూడదు. తన కడుపులో చిచ్చుపెట్టకూడదు అని కనిపించని దేవుళ్ళని వేడుకొంటోంది శాంతమ్మ.

'చెప్పు? చెప్పు? నీ కొడుకెక్కడున్నాడో చెప్పు. గవర్నమెంట్ ఇచ్చే లక్షల రూపాయలు నీకే ఇస్తాం' అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఒకసారి ఆమె ఇల్లు సోదా చేసినప్పుడు.

'లక్షలెక్కువా తల్లి ప్రేమెక్కువా?' అని అడిగింది కన్నీళ్ళింకిపోయిన ఆ తల్లి.

నెత్తిమీద టోపీ తీసుకొని తిరిగి నెత్తి మీద కదలకుండా పెట్టుకొని 'పోలీసోడికున్న పవరు ఎక్కువ' అని చెప్పి వెళ్ళిపోయాడు.

☆

ర్యాగింగ్ ఏ సంస్కృతి?

తర్జన భర్జన

హింసాత్మక నేర ప్రవృత్తి

ర్యాగింగ్ అనేది హింసాత్మక నేర ప్రవృత్తి. అడవులలో ఉండే క్రూరమృగాల్లా ఈ ర్యాగింగ్ విషయంలో మన సమాజంలో ఉన్న విద్యార్థులు ప్రవర్తిస్తున్నారు. ఏ మారుమూల ప్రాంతం నుంచో చదువుకొని ప్రయోజకులుగా అవ్వాలన్న లక్ష్యంతో వచ్చిన విద్యార్థులకు కాలేజీలలో ర్యాగింగ్ అనే హింసాత్మక ప్రవర్తనవల్ల వారి జీవితాలు అనేక ఒడిదుడుకులకు దారితీస్తుంది. ఏదిఏమైనా ఈ ర్యాగింగ్ హింసాత్మక ప్రవర్తన నిర్మూలనకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని మాలాంటి విద్యార్థుల జీవితాలు కాపాడాలని ఆశిస్తున్నాను.

-వి.సుభాష్‌చంద్రబోస్ (విజయనగరం)



వస్త్రాపహరణం చేసే నరకం

ర్యాగింగ్ ఏ సంస్కృతి అంటే? ఇతమిత్థంగా చెప్పలేం. ఎందుకంటే నేడు కాలేజీలలో సీనియర్ స్టూడెంట్స్, జూనియర్ స్టూడెంట్లనే ఏడిపించడమే వాళ్ళ జన్మహక్కుగా భావిస్తున్నారు. అసలు ర్యాగింగ్ అంటే కొత్తగా కాలేజీలో ప్రవేశించే జూనియర్లను సీనియర్లు వాళ్ళ భయాన్ని పోగొట్టి వాళ్ళతో ఫ్రెండ్‌షిప్ చేసుకొనే విధంగా ఉండాలే కాని 'కాలేజీకి ఎందుకొచ్చాంరా బాబు' అనే ఫీలింగ్ వాళ్ళ హృదయాలలో నాటుకొనే విధంగా ఉండకూడదు. ర్యాగింగ్ అంటే కాలేజీలలో ఫ్రెండ్‌షిప్ చేసే స్వర్గంలా ఉండాలే తప్ప వస్త్రాపహరణం చేసే నరకంలా ఉండకూడదు.

-కొత్తపల్లి శ్రీ వెంకటరమణశాస్త్రి (పెదపళ్ళ)

నరదాల హరివిల్లు

ర్యాగింగ్ అనేది సీనియర్ స్టూడెంట్స్ కొత్తగా కాలేజీలో చేరిన జూనియర్ విద్యార్థులకు కాలేజీ అనగానే దానిపట్ల ఉన్న బిడియం పోవాలని, సీనియర్స్‌కు జూనియర్స్‌కు మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడాలని ఆకతాయితనంగా సరదాగా సాగే ఆటే ర్యాగింగ్. కానీ ఇప్పుడు ఈ ర్యాగింగ్ ప్రాణాంతకమై అమాయక విద్యార్థుల ప్రాణాలు కోల్పోయేటంత గొప్ప విధంగా రూపుదిద్దుకుంది. ర్యాగింగ్ రాక్షసంగా కాకుండా మితంగా లయబద్ధంగా ఉంటేనే బావుంటుందని నా అభిప్రాయం.

-కెల్ల విఘ్నేశ్వరరావు (విజయనగరం)

ఆటవిక సంస్కృతి

జీవరాసిలో మాట్లాడే జంతువు మనిషి. సంచార జీవిగా ఉన్న మానవుడు కొంతకాలానికి స్థిర నివాసాన్ని ఏర్పరచుకొని సంఘ జీవనానికి అలవాటుపడ్డాడు. అనేక విశృంఖలావతారాలు ధరించిన మానవుడు ఆటవిక జీవనం నుండి బైటపడి నాగరికం వైపు మళ్ళి వావివరసలు నేర్చుకున్నాడు. తల్లికి, భార్యకు, సోదరికి, సోదరునకు తేడా నిర్ణయించుకున్నాడు.

యోగాపరంగా, సంస్కృతీపరంగా ఎంతో ముందున్న మనం విదేశీ సంస్కృతి చేటుతో ర్యాగింగ్ అనే ఈ ఆటవిక సంస్కృతి విద్యాలయాల్లో పాకింది. సీనియర్ తాను అధికుడై జూనియర్‌ను ఏడ్పించడం ర్యాగింగ్ సారాంశం. నియమబద్ధ జీవనం గడిపే మనం వ్యంగ్య పద్ధతులను అవలంబించడం ఘోరం. ఈ విష సంస్కృతిని నిషేధించి విద్యాలయాల్ని స్వర్గతుల్యం చేయాలి.

-వాస్తు రామచంద్ర (నెల్లూరు)

ర్యాగింగ్ రాక్షసత్వానికి అడ్డుకట్ట వేయాలి

జీవితం మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్న నేటి విద్యార్థులకు కళాశాలలలో ర్యాగింగ్ అనేది ఆత్మహత్యలకు దారితీస్తుంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ర్యాగింగ్‌ను నిషేధించినా ఇటీవల జరుగుతున్న ర్యాగింగ్ బాధితుల ఆత్మహత్యల పరంపరను చూస్తుంటే ర్యాగింగ్ రాక్షసత్వానికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చూపిస్తున్న చొరవ ఏమిటనేది సులభంగానే అర్థమవుతుంది. ఆర్.ఇ.సి. వరంగల్‌లో ర్యాగింగ్‌కు బలైన రాఘవేందర్ ముఖ్యమంత్రికి రాసిన కన్నీటి అక్షరాల తడి ఆరకముందే వరంగల్‌లోని 'కిట్స్' కాలేజి విద్యార్థి రవి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏ కారణాలతో సమర్థించినప్పటికీ ర్యాగింగ్ అనేది రాక్షస సంస్కృతిలో ఒక భాగం మాత్రమే. ఆర్డినెన్సులు తేవడం ముఖ్యం కాదు. వాటి అమలుపట్ల చిత్తశుద్ధి ఉండాలనే విషయాన్ని ఇప్పటికైనా ప్రభుత్వం గ్రహించాలి.

-ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు (అమలాపురం)

అనాగరిక సంస్కృతి

50 సం.ల స్వాతంత్ర్య భారతంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన మన సంస్కృతీ సాంప్రదాయాలను అప్రతిష్ఠ పాలుచేసే అంతర్గత అనాగరిక సంస్కృతిలో ర్యాగింగ్ ఒక మచ్చుతునక. ర్యాగింగ్ రాక్షసత్వానికి బలైపోయిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు. పై చదువులకై దూర ప్రాంతాల నుండి వచ్చి ర్యాగింగ్ అనే అనాగరిక సంస్కృతి పేరిట మానసిక శారీరక హింసలకు ఎంతోమంది బలై పోతున్నారు.

-బండమీది శ్రీనివాస్ (పుట్టపాక)

దురాచార సంస్కృతి

జ్ఞానదేవాలయాలుగా విలసిల్లే విద్యాలయాలు నేడు ర్యాగింగ్ రోగంతో విలువలు కోల్పోతున్నాయి. భవిష్యత్ప్రధాతలుగా భాసిల్లే విద్యార్థులు ఈ దురాచార సంస్కృతిలో మునిగి తేలుతున్నారు. స్నేహం, ఆత్మీయత ముసుగులో విద్యార్థుల మధ్య ఈ విషం ప్రబలంగా వ్యాప్తిచెందటం విచారకరం. తోటి విద్యార్థిలో స్నేహపూరిత వాతావరణాన్ని పెంపొందింపజేసే సీనియర్లు రకరకాల పద్ధతులతో అన్నివిధాల అగచాట్లకు గురిచేసి చివరకు వారి మరణాలకు కూడా కారణమయ్యే ర్యాగింగ్ సంస్కృతి అనే పదంలోకి వర్తించదు. ఆ వాతావరణానికి దూరంగా సచ్ఛీలతను విద్యార్థులు పెంపొందించుకుంటే ఈ సంస్కృతి అతిత్వరలో రూపుమారుతుంది.

-బొరుసు రామచంద్రరావు (వానపల్లి)

'ర్యాగింగ్ రక్కసి'

విజ్ఞానాన్ని, విజ్ఞతను అందించే విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల రూపంలో 'ర్యాగింగ్ రక్కసి' స్వైరవిహారం చేయడం అత్యంత విషాదకర పరిణామం. సుదూర ప్రాంతాల నుంచి ఎందరో విద్యార్థులు ఎన్నో ఆశలతో, కలలతో యూనివర్సిటీ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే ఆహ్వానం పలికేది ర్యాగింగ్ రక్కసేనని చెప్పడం అతిశయోక్తి కాదు. ర్యాగింగ్ నిషేధ చట్టం చేసినా, అదింకా విశ్వవిద్యాలయాలకు చేరినట్టు లేదు. ఒకప్పుడు విశ్వవిద్యాలయాల్లో విద్య అంటే రవీంద్రుని విశ్వభారతిలో విద్యను అభ్యసించినంత సంబరంగా ఉండేది. కానీ నేడు విశ్వవిద్యాలయాల్లో విద్య అంటే విశృంఖల ర్యాగింగ్‌కు నిలయాలు. ర్యాగింగ్ రక్కసి ప్రధాన సమస్యగా మారకముందే దీనిని పూర్తిగా నిర్మూలించాలి.

-వక్కి బాలమురళీకృష్ణ (సోంపేట)

ఓ విష సంస్కృతి

ర్యాగింగ్ ఓ విష సంస్కృతి. నేడు విద్యాలయాల్లో ఇది వికృత రూపం దాలుస్తోంది. కొత్తగా కళాశాలల్లో అడుగుపెట్టిన విద్యార్థినీ విద్యార్థులు ర్యాగింగ్ వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవలి కాలంలో ఈ ర్యాగింగ్ ప్రతి విద్యాలయానికీ పాకింది. సరదాగా ఏడిపించడం వేరు, హింసించి పైశాచికానందాన్ని పొందడం వేరు.

-వి.బాలకృష్ణ (పామర్రు)

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా
ఎడిటర్ (ఆదివారం ఆంధ్రభూమి)
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-3